# ఈ క్షణం దాటనీ

''మిస్ అనూ''

''యస్ సర్'' డిక్టేషన్ తీసుకోడం పూర్తి చేసి లేవబోతున్న అనుపమ ప్రశ్నార్థకంగా చూసింది.

''ప్లీజ్ సిట్‌డౌన్... అర్థింపుగా అన్నాడు హరీష్.

హరీష్ ఎప్పుడన్నా పర్సనల్ విషయం మాట్లాడాలంటే డిక్టేషన్ ఇచ్చాక ఇలా అర్థించడం మామూలే...

తన స్టాఫ్ అందరిలో అనుపమ అంటే హరీష్‌కి ఎంతో గౌరవం...

వయసులో చిన్నదైనా ఎలాంటి సమస్యనైనా చిటికెలో సాల్వ్ చేసి హరీష్‌కి ఎన్నోసార్లు ఊరటనిచ్చింది.

పెద్దదానిలా ఏదో ఒక సలహా ఇస్తూ ఉంటుంది.

ఫ్యామిలీలో చిన్న చిన్న గొడవలై చికాగ్గా ఆఫీస్‌కొచ్చే హరీష్‌కి చెదరని చిరునవ్వుతో, తీయని కబుర్లతో శాంతినిస్తుంది.

ఏనాడూ హద్దు మీరని ఆ అమ్మాయి తీసుకునే చనువుకి క్రమంగా అలవాటు పడ్డ హరీష్ తనంతట తానుగానే సలహా కోరడం, ఏదన్నా అవసరమనిపించిన విషయం ఆమెతో సంప్రదించడం మొదలు పెట్టాడు.

అది అర్థం అయిన అనుపమ కుర్చీలో కూర్చోని ''చెప్పండి ఏనీ ప్రాబ్లెమ్!'' అన్నది.

మౌనంగా ఒక ఇన్‌లాండ్ కవర్ అందించాడు.

సందేహిస్తూ చూసింది...

''ఫర్వాలేదు. చదువు. ప్రాబ్లెమ్ తెలుస్తుంది.

కొంచెం సందేహిస్తూనే విప్పి చదివింది. నాలుగే వాక్యాలు...

''అన్నయ్యా!

ఇక్కడ క్షేమం... మీ బావగారు అనుకోకుండా బొంబే వెళ్ళారు. నా ఆరోగ్యం బాగా లేదు... అర్జంట్‌గా వదినను నాలుగు రోజులు సాయానికి పంపవలసింది... నేను ప్రస్తుతం రాలేను...........

ఎదురుచూస్తూ,

కరుణ.

''ఈ లెటర్ వచ్చి వారం అవుతోంది... అనూ యునో... మైవైఫ్...''

''అవును వాళ్ళ మదర్‌కి సీరియస్‌గా ఉందని టెలిగ్రాం వస్తే వెళ్ళారు కదా... ... ఎలా ఉన్నారిప్పుడు వాళ్ళ మదర్?''

''షి ఈజ్ బెటర్... బట్... నీలు ఇప్పుడే రాక పోవచ్చు. మా మదర్ యాత్రలకి వెళ్ళారు... చూడు ప్రాబ్లెమ్స్ అన్నీ ఒక్కసారే వచ్చాయి. వారం నుంచీ ఆలోచిస్తున్నా సొల్యూషన్ దొరకలేదు. ఏం చేయాలి? కరుణకి రిప్లై కూడా ఇవ్వలేదు నేను.

'' ఏం చేయాలనుకుంటున్నారు? -''

''నేను ఈరోజు సూర్యాపేట వెళుతున్నాను. అక్కడ్నించి బహుశా, విజయవాడ, ఏలూరు వెళ్ళాల్సిరావచ్చు. తిరిగి రావటానికి నాలుగు రోజులు పడుతుంది - నేను లేకపోతే నీవు ఖాళీయేకదా!

అనుపమకి అర్థం అయింది.

ఇంతకు ముందు కూడా చాలాసార్లు హరీష్ క్యాంప్‌లకు వెళ్ళినప్పుడు నీలిమకు సాయంగా వాళ్ళింట్లోనే ఉండేది...

అనుపమకి ఎవరూలేరు...

తన దగ్గర పనిచేసే ఆమెని తన ఇంట్లో మనిషిగా పరిగణిస్తాడు. అందుకే నిస్సందేహంగా ఏ సాయం కావాలన్నా చేస్తుంది...

''ఎన్ని రోజులుండాలి?'' మామూలుగా అడిగింది.

''అనూ! కరుణకి ఏమైందో తెలీదు నాకు. తన ప్రాబ్లెమ్ అంతకన్నా తెలీదు... ఎప్పుడూ ఏ సాయం కోరలేదు. అనూ ప్లీజ్... నిజానికి నేనిలా అడగటం భావ్యం కాదు. కానీ నీవు మాకు కొత్త కాదు కాబట్టి అడుగుతున్నాను - ఒకవేళ నీకేదన్నా ఇబ్బంది ఉంటే చెప్పు''...

అను మాట్లాడలేదు... కరుణ ఒక్కతే కదా! మగవాళ్ళెవరూ ఉండరు... ఒకవేళ ఇబ్బంది అయితే వెంటనే తిరిగి వచ్చేయాలి... ...

అడిగేది హరీష్... మరెవరో కాదు...

తెలిసిన వాళ్ళ ద్వారా తన ప్రాబ్లెమ్ విని ఉద్యోగం ఇచ్చి, ఆదుకుని ఆదరించిన సహృదయుడు, సంస్కారి...

హరీష్ అంటే అంతులేని గౌరవంతో పాటు అపారమైన అనురాగం, ఆరాధనా కూడా ఉన్నాయి అనుకి...

నిశ్శబ్దంగా తల ఊపింది...

హరీష్ మొహం వికసించింది...

''అనూ సిన్సియర్‌గా ఒప్పుకుంటున్నావా!

అనుపమ నవ్వింది... ''నేనెప్పుడన్నా హాఫ్‌హార్టెడ్‌గా ఏ పనన్నా చేశానా?...''

''ఓ.కె... థాంక్యూ వెరీమచ్... చూడు... ఈ లెటర్స్ చేసి ఇంటికెళ్ళిపో... సాయంత్రం అయిదు గంటలకి ప్రయాణం... కారులో వెళ్దాం...''

''ఓ.కె...'' అనుపమ లేచివెళ్ళిపోయింది -

అనుకున్న ప్రకారం బయలుదేరక పోవటంతో రెండు గంటలు లేటుగా చేరారు.

కారు సూర్యాపేట చేరేటప్పటికి రాత్రి పదిన్నర దాటింది.

నేరుగా తీసికెళ్ళి కరుణ ఇంటి ముందు ఆపాడు.

బాగా చీకటిగా ఉంది బైట-

హరీష్ కారుదిగి, గేటు తీసుకుని వరండాలో కెళ్ళి తలుపు కొట్టాడు.

లోపల సవ్వడి లేదు... కిటికీలు కూడా వేసి ఉన్నాయి.

లోపల్నుంచి వెలుతురు కూడా పట్టంలేదు.

జేబులోకి చేయి పోనిచ్చి సిగరెట్ లైటర్ తీసి వెలిగించాడు.

''ఓ గాడ్'' అప్రయత్నంగా అతని నోటి నుండి వచ్చింది.

వెనక్కి తిరిగి కారు దగ్గరికి వచ్చి

''అనూ! ఇంటికి తాళం... కరుణ ఎక్కడికో వెళ్ళింది - ఎలా?'' అన్నాడు.

అనుపమకి నీరసం వచ్చింది...

''ఎక్కడి కెళ్ళారో పక్కవాళ్ళని అడగండి'' అన్నది.

వాళ్ళెవరో నాకు తెలీదే... ఎలా...''

''తప్పదు మరి. ఇప్పుడు తెలుసుకోవాలిగా!...''

హరీష్ అయిష్టంగానే మళ్ళా వెనక్కి తిరిగి పక్క వాళ్ళింటి తలుపు కొట్టాడు -

రెండుసార్లు తలుపు కొట్టాక లోపల్నుంచి ఎవరో హాల్లోకి వచ్చి లైటు వేశారు...

కిటికీ తలుపు ఓరెక్క తెరిచి '' ఎవరూ'' అన్నది ఓ స్త్రీ గొంతు...

చలికాలం కావడంచేత అంతా తలుపులూ, కిటికీలు మూసుకుని లోపల కూర్చున్నారు...

''పక్కింట్లో కరుణ - ఎక్కడికెళ్ళిందో తెలుసా?'' అడిగాడు హరీష్..

''మీరెవరు?''... అన్నది మళ్ళీ ఆమె -

''కరుణ అన్నయ్యని నా పేరు హరీష్ - ''

''ఒక్కనిమిషం -'' ఆ అమ్మాయి రెండు సెకన్లలో తలుపు తీసి - ''లోపలికి రండి'' అని ఆహ్వానించింది.

హరీష్ లోపలికెళ్ళి నిలబడే అడిగాడు -

''కరుణ?''

''కరుణ గార్కి వంట్లో బాగాలేదు పది రోజుల్నుంచి. వాళ్ళాయన ఏదో ట్రైనింగ్ అని బొంబే వెళ్ళారు.

ఆమె అతను వెళ్ళాక సుస్తీ పడ్డారు - వెంటనే మీకు లెటర్ రాశారట... మీనుంచి జవాబు కోసం - వాళ్ళ వదినగారి కోసం ఎదురు చూశారు...

నిన్ననే వాళ్ళత్త గారు వచ్చి వాళ్ళ ఊరు తీసి కెళ్ళారు... ఆమె ఇక్కడ ఉండటానికి వాళ్ళ మావగారికూడా ఆరోగ్యం సరిగా లేదని కరుణగారినే తీసికెళ్ళారు.

మీరొస్తే చెప్పమని చెప్పారు...'' తన బాధ్యత అయిపోయినట్టుగా గబగబా వప్పచెప్పి ఊపిరి పీల్చుకుంది.

హరీష్ బాధగా నుదురు రాసుకున్నాడు...

''టూ లేట్...'' గొణుక్కున్నాడు....

''ఓ.కే... నేను వచ్చి, వెళ్ళానని చెప్పండి వస్తాను - థాంక్స్యూ''

వడి వడిగా బయల్దేరి కారు దగ్గరికి వచ్చి కారు స్టార్టు చేశాడు...

సందు మలుపు తిరగ్గానే అడిగింది అనుపమ...

'' ఏం జరిగింది?''

''కరుణ వాళ్ళత్తగారు వచ్చి తీసికెళ్ళారుట-'' అంటూ ఆ అమ్మాయి చెప్పింది చెప్పాడు... ...

''అనూ కరుణ ఏమనుకుందో... ప్చ్... చూడు ఒక్కోసారి పరిస్థితులెలా వస్తాయో! నిట్టూర్చాడు...

''ఏసీవే... ఇప్పుడు మనం ఏం చేద్దాం?- అడిగాడు.

అనుపమ మాట్లాడలేదు...

సాహసం చేసి అతని మీద నమ్మకంతో వచ్చింది....

ఇప్పుడు అతనేం చెబితే అది చేయాలి తప్పదు.

ఈ రాత్రి తిరిగి హైదరాబాద్ వెళ్ళటం అంటే... మళ్ళీ తనని దింపి హరీష్ వెనక్కి రావాలి... ఏమంటాడో... అందుకే మాట్లాడలేదు--

''అనూ ముందు మనం హోటల్‌కెళ్ళి భోంచేద్దాం...

ఆ తరువాత ఆలోచిద్దాం... లేదూ ఒక విషయం చెపుతాను విను... ఇక్కడ నాకు తెలిసిన హోటల్ ఉంది... నేను ఎప్పుడు పని మీద వచ్చినా అందులోనే దిగుతాను. నీకు అభ్యంతరం లేకపోతే ఆ హోటల్లో ఈ రాత్రి ఉండు... రెండు సింగిల్ రూమ్స్ బుక్ చేయిస్తాను... మార్నింగ్ నువ్వు బస్‌లో వెళ్ళిపో ఓ.కే...''

''మీ ఇష్టం...''

''అనూ! అయామ్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ.... నిన్ను చాలా ఇబ్బంది పెట్టాను కదూ!...''

అతని కంఠంలో బాధకీ, మార్దవానికీ చలించిపోయింది...

''లేదు... ఇబ్బందేమిటి... ఈ పని ఒక్కరోజు ముందుచేస్తే బాగుండేది...'' అన్నది....

మనసులో అనుకుంది...'' హరీష్ ఈ రాత్రి ఇలా నీ పక్కన కారులో కూర్చుని ప్రయాణం చేయటంలోని తీయని అనుభూతి నాకు మాత్రమే తెలుసు... ఈ అనుభవం నా బ్రతుకంతా దాచుకుంటాను....

చల్లగాలిలో, చీకట్లో, ప్రశాంతమైన రోడ్ల మీద, కాపలా కాస్తున్నట్లున్న చెట్ల మధ్య నుండి దూసుకుపోతున్న కారులో అలా హరీష్ పక్కన కూర్చున్న అనుపమ మనసు తీయని భావంతో పులకించిపోయింది... ...

అది బైటకి కనపడనివ్వకపోవడం ఆమె ప్రత్యేకత...

''అనూ... కారుదిగు... ఏ లోకంలో ఉన్నావు...''

ఉలిక్కిపడింది అనుపమ...

మెల్లిగా షాల్ సరిచేసుకుంటూ దిగింది.

హరీష్‌ని చూడగానే విష్ చేశాడు ప్రొప్రైటర్... ...

హోటల్ పరీక్షిస్తూ నిలబడింది...

బహుశా ఆ ఊళ్ళో అదేకాస్త మంచి హోటల్ కాబోలు అనుకుంది...

''ఛ మనం బయలుదేరిన వేళ బాగాలేదు'' విసుగ్గా సిగరెట్ కింద పారేస్తూ వచ్చాడు హరీష్ -

'' ఏం?...''

''నేను బయల్దేరేముందు ఫోన్ చేశానని నా ఒక్కడికి మామూలుగా సింగిల్ రూమ్ అట్టే పెట్టాడుట... వీడి హోటల్‌కి గిరాకీ తగిలింది... అన్ని రూమ్స్ ఎంగేజ్ అయిపోయాయట... ఎవరో టూరిస్టులు దిగార్ట''

అనుపమ గుండెల్లో రాయిపడింది'' ఎలా ఇప్పుడు? అప్రయత్నంగా అన్నది.

''అదే ఆలోచిస్తున్నాను'' అని ''పరే ముందురా అన్నం తిందాం ఆకలేస్తోంది. కొంచెం రెస్ట్ తీసుకోడానికి ఆ రూమేచాలు కదా! ఆలోచిద్దాం పద''

హరీష్ మేడమెట్లెక్కుతుంటే అనుసరించింది.

వాళ్ళ వెనకాలే బాయ్ వచ్చి తలుపు తీసి, లైట్ వేశాడు.

గది శుభ్రంగా ఉంది ఒకే మంచం ఒక టేబిల్, కుర్చీ... కిటికీలో ఖూజాలో నీళ్ళు తళతళలాడే గాజుగ్లాసు... అటాచ్‌డ్ బాత్‌రూమ్, వగైరా.

బాయ్‌కి భోజనం చెప్పి ''కూర్చో అనూ'' అంటూ ఆమెని కుర్చీలో కూర్చోమని తానూ మంచం మీద కూర్చున్నాడు.

అనుపమ కాళ్ళు చేతులూ కడుక్కొని వచ్చింది.

హరీష్ కూడా లేచి వెళ్ళాడు.

అయిదు నిమిషాల్లో వేడిగా అన్నం, కూర, సాంబారు,.రసం, ఆవకాయ, పెరుగు వచ్చాయి.

బాగా ఆకలిగా ఉన్నారేమో నిశ్శబ్దంగా తిన్నారిద్దరూ -

''ఇప్పుడు చెప్పు నీవు ఏమీ అనుకోకపోతే నేను ప్రొప్రైటర్‌కి చెప్పి ఒక క్యాంప్‌కాట్ తెప్పిస్తాను. ఈ ఒక్క రాత్రే మహా అంటే... చూడు ప్రస్తుతం టైము పన్నెండవుతోంది. ఒక్క ఆరుగంటలు రెస్ట్ తీసుకుంటే ఈ చలి కాలపు రాత్రి తెల్లవారుతుంది. దయుంచి ఇలాంటి సిట్యుయేషన్ తెచ్చినందుకు నన్ను మన్నించి ఈ ఆరుగంటలు అడ్జస్ట్ అయినావంటే ఇంకెప్పుడూ నీకిలాంటి పరిస్థితిరానీయనని నా ప్రామిస్'' అన్నాడు.

అనుపమకి ఎలాగో అనిపించింది.

పాపం ఎంత బాధపడుతున్నాడో! తను ఇబ్బంది పడినట్లు కనిపిస్తే మరీ ఫీలవుతాడు పోనీ ఈ రాత్రి అడ్జస్ట్ అవ్వాలి తప్పదు అనుకుంది.

అనుపమ అంగీకారంతో క్యాంప్‌కాట్ వచ్చింది. దిండూ, దుప్పటి అన్నీ అరేంజ్ చేశాడా ప్రొప్రైటర్.

''థాంక్యూ అనూ, అండ్ ఆల్సో హై అపాలజీస్'' అన్నాడు హరీష్ మంచంపై వాలి.

''దయుంచి మాటిమాటికి అలా మాట్లాడకండి ఇలా జరుగుతుందని మీరుకలగన్నారా?''

''ఓ... కోపం వచ్చిందా సారీ''

''అదిగో మళ్ళీ.......''

''ఓ... ఓ.కె... అనను'' నవ్వుతూ పక్కకి వత్తిగిల్లాడు.

''నాకో జబ్బుంది...'' అను హఠాత్తుగా అంది.

''ఏమిటది? నిద్రలోకానీ నడిచిపోవుకదా!'' పడుకున్నవాడు లేస్తూ ఖంగారుగా అడిగాడు.

ఫక్కున నవ్వింది.

''కాదు... ఏదన్నా చదువుకోందే నిద్రపట్టదు. లైట్ మీకు డిస్టర్బ్ అవుతుందేమో అని...''

''అబ్బ అంతే కదా చదువుకో అలాగే ఏదన్నా పుస్తకం ఇవ్వు'' అన్నాడు రిలాక్స్ అవుతూ.

''నాలుగైదు రోజులుంటాను కదా అని చాలా తెచ్చాను. తీసుకోండి'' అతనికో నవల ఇచ్చి తనూ ఓ నవల తీసుకొంది.

దిండు గోడకానించి వీపువైపు పెట్టుకుని మంచం మీద అడ్డంగా కూర్చుని నవల చదవడంలో మునిగిపోయింది.

పావుగంట చదివాక తలెత్తిన అనుపమ నవల పక్కన పడేసి అటూ ఇటూ పొర్లుతున్న హరీష్‌ని చూసింది.

అప్పుడే అతనూ అనుపమ వైపు చూశాడు.

ఒక్కసారిగా ఆమె గుండె ఝల్లుమంది. తమాయించుకుని ''మీకు డిస్టర్బెన్స్‌గా ఉన్నట్టుందే లైటు తీసేస్తాను పోనీండి'' అంటూ లైట్ ఆఫ్ చేసి మంచంపై వాలి కళ్ళు మూసుకుంది.

బాగా చలిగా ఉండటం చేత కిటికీలు కూడా బిగించేశాడు. అయినా పైన వెంటిలేటర్ లోంచి చల్లగాలి వీస్తోంది.

ఆ వాతావరణం, తనకు అడుగు దూరంలో హరీష్...

అతని చూపుల్లో కనిపించిన కొత్తరకపు భావం....

అనుపమకి కంగారో, భయమో, ఇష్టమో తెలీని ఒక భావం ఊపేయసాగింది.

నిద్రపట్టలేదు... గట్టిగా కళ్ళు మూసుకుంది.

అవతల హరీష్‌కి కూడా తనకు అడుగు దూరంలో పడుకున్న అందమైన ఆడపిల్ల. ఆ చల్లని వాతావరణం పిచ్చెక్కిస్తుంటే నిద్రపట్టక దొర్లాడు...

అతను మాటిమాటికీ అనుపమ వైపు చూస్తున్నాడు. చూపులు కలుపుతుందేమో ఆ చూపుల్లో అంగీకార భావం కదులుతుందేమోనన్నట్టు.

కానీ అనుపమ చాలా జాగ్రత్తగా పడుకుంది.

హరీష్‌కి ఇంక కంట్రోల్ చేసుకోవడం సాధ్యం కాదనిపించింది. మెల్లిగా మంచం పైనుంచి లేచాడు.

అనుపమ అడుగుల శబ్దానికి కళ్ళు తెరిచింది.

హరీష్ ఖంగారుగా ''మ-మంచినీళ్ళు'' అన్నాడు.

నిశ్శబ్దంగా లేచి కూజాలోంచి నీళ్ళువంచి అందించింది.

హరీష్ గటాగటా తాగేసి గ్లాసు అందించాడు.

''చాలా'' చీకట్లో మధురంగా ధ్వనించింది ఆమె కంఠం.

హరీష్ చప్పున ఆమె చేయందుకుని ఉద్వేగంగా ''అనూ'' అన్నాడు.

అనుకోని ఆ సంఘటనకు అనుసమ ఆపాదమస్తకం కంపించింది. అణువణువూ పరవశించింది.

బలవంతంగా తనను తాను కంట్రోల్ చేసుకుని ''పడుకోండి...'' అన్నది.

హరీష్ వెంటనే చేయివదలి తన మంచం దగ్గరికి వెళ్ళిపోయాడు.

హరీష్ మీద అనుపమకి ఉన్నది ఆరాధన అంతే...

అది కలుషితం కాకూడదని ఆమె చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. ఎన్నోసార్లు అదుపు తప్పిన మనసుని కళ్ళాలేసి బిగించింది.

హరీష్ మంచివాడు... కాని మగవాడు... పరిస్థితులకు మగవాడు బానిస.... కానీ తను స్త్రీ... పరిస్థితుల్నే తనకి బానిసగా చేసుకోవాలి.

అతన్ని ఆ క్షణంలో చూస్తుంటే చాలా జాలేసింది.

పవిత్రత పక్కకు పెట్టి తన ఆరాధ్యదైవానికి తనని నైవేద్యం పెట్టాలని అనిపించింది.

కానీ... ఒక్కసారి జారిన ఈ క్షణం హరీష్ బ్రతుకునే మార్చేస్తే... ఆ దంపతుల మధ్య కలతలు రేపితే... తనకెంతో మేలుచేసిన ఆ కుటుంబానికి అలాంటి ద్రోహం... ఛీ

సమాజంలో నీచులైన మగవాళ్ళని చూసి చూసి విసిగి పోయిన అనుపమకి హరీష్ ఆశ్రయం పెద్దకోటగోడలా ఉంది. అతని మంచితనానికి తన మనసు అర్పించింది. కానీ అది కేవలం ఆరాధన.

అలాంటిది ఈ క్షణంలో లొంగిపోతే నీలిమదృష్టిలో పురుగుకన్నాహీనం అవుతుంది.

తనకు తెలుసు భార్యకున్న స్థానం తరవాతే ఈ ప్రపంచంలో ఏదైనా. ఉదాహరణాలు ఎన్నో చూసింది.

అలాంటిది ఇప్పుడిలా ఈ క్షణానికి లొంగితే తానేంటి?

అనుపమ ఉలిక్కి పడింది.... భుజంమీద హరీష్ చేయి...

''నిద్రపట్టటం లేదా?'' కలవరాన్ని అణచుకుంటూ అడిగింది.

హరీష్ మాట్లాడలేదు... అతని చేతులు అనుపమని చుట్టేశాయి.

అనుపమ అనువణువూ పులకరించింది...

కానీ... ఆమెలోని సంస్కారం, వివేకం హెచ్చరించాయి.

అతను మగవాడు... అతను మగవాడు... అని...

''హరీష్'' మధురంగా పిల్చింది. హరీష్ కళ్ళెత్తి చూశాడు.

''ఎంత అందమైన కళ్ళు... పరవశించింది అను హృదయం.''

''అనూ, ఐ లవ్ యూ...'' గొణిగాడు.

''ఎప్పట్నించి''

''అంటే...?''

''అంటేనా?'' నవ్వింది. స్విచ్ నొక్కింది లైటువెలుతురు గదిలో పరుచుకుంది అతని చేతులు తొలగించి సరిగ్గా కూర్చుంది.

''మీరు నీలిమ గార్ని ఎంతో ప్రేమిస్తున్నారు మీ భార్యను విడిచి ఒక్కరోజు ఉండాలన్నా గిలగిల్లాడుతారు అలా నన్ను ప్రేమిస్తున్నారా?''

''... ... ....''

''హరీష్. ఆడది కావల్సి వచ్చినప్పుడు

ఎదురుగా ఉన్న స్త్రీతో ప్రతి మగవాడు చెప్పే కామన్ డైలాగ్ ఐ లవ్ యూ... నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. ఆరాధిస్తున్నాను అంతకన్నా ఎక్కువగా గౌరవిస్తున్నాను కారణం మీరు అందరు మగవాళ్ళలా కాదనే ఉద్దేశంతో, అందుకే ఆ నమ్మకంతోనే మీరు కోరగానే ఇలా వచ్చాను... కానీ, అవకాశం దొరికితే మీరూ సామాన్యమైన మగవాళ్ళలా ప్రవర్తిస్తారని ఇప్పడే తెలుసుకున్నాను... నేను మీ కోరిక తీరుస్తాను నాకొక ప్రామిస్ చేస్తారా?

'' ఏమిటది''

''నన్ను నీలిమగారి అంగీకారంతో వివాహం చేసుకుంటారా? నన్ను మీ రెండో భార్యగా ఈ సొసైటికి పరిచయం చేస్తారా?''

''అనూ''

''మీరు చేయలేరు కదూ! మీరంటే ఎంత ఇష్టం ఉన్నా మీ ప్రియురాలిగా మాత్రం ఉండలేను... భార్య అనే గౌరవప్రదమైన స్థానం కావాలి నాకు.

హరీష్ ప్రతిమనిషి జీవితంలోనూ కొన్ని బలహీన క్షణాలు వస్తాయి. వాటిని జయించ గలిగితే ఆ మనిషి జీవితంలో అశాంతి అనేది ఉండదు.

మీలోని ఆవేశం, ఉద్రేకం తగ్గాక ఆలోచించండి నేను మిమ్మల్ని ఎప్పట్లా గౌరవించాలంటే నేను ఊహించిన స్థాయినుంచి దిగజారకండి... మానవ బలహీనతల్ని అర్థం చేసుకోగలను కాబట్టి ఇలా చెబుతున్నాను... ప్లీజ్ వెళ్ళండి మీ మంచం దగ్గరికి. అండ్ ప్లీజ్ రిమెంబర్ నాకు ఈ ఉద్యోగం చాలా అవసరం''

హరీష్ అచేతనుడిలా నిలబడి పోయాడు.

కొన్ని క్షణాల తరవాత నిశ్శబ్దంగా బైటికెళుతూ అన్నాడు.

''సారీ... ఎక్స్‌ట్రీమ్‌లీ.''

మయూరి వార పత్రిక